www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -11 శుక్రవారం 24 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సమ్మెలో విషాదం

### వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్‌గౌడ్

- పరిస్థితి విషమం.. కార్మికుల్లో తీవ్ర ఆందోళన
- రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కొనసాగిన సమ్మె
- పోలీస్ భద్రత మధ్య 45శాతం బస్సులు రోడ్లపైకి..
- నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో సమావేశం
- రోజుకో తరహాలో నిరసన కార్యక్రమాలు: ఆర్టీసీ జేఏసీ
- తొందరపాటు వద్దు.. ప్రాణం పోతే తిరిగిరాదు!
- ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నంపై సీఎం రేవంత్
- సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నామని వ్యాఖ్య
- చర్చలు సరిగా జరపలేదని అధికారులపై అసహనం

**హైదరాబాద్ ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ..




వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేశారు. బస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోలు పోసుకుని, నిప్పంటించుకున్నారు. ప్రయాణికులు,**మిగతా 2లో...**

## ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

హర్మూజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు

-నిర్బంధించినంత కాలం తెరిచేది లేదు : ఇరాన్

యుద్ధంతో పతనం దిశగా ఆర్థిక వ్యవస్థ



**వాషింగ్టన్ ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకా దళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు.**మిగతా 2లో...**

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ

పార్టీ సంస్థాగత నిర్మాణపైనా చర్చ

నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన



## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
అసెంబ్లీ ఎన్నికల తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ. 25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని వస్తున్నవార్తలను ప్రభుత్వం గురువారం కొట్టివేసింది. అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 29 నాటికి పశ్చిమబెంగాల్ **మిగతా 2లో...**



## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం

ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం

నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



## పల్లెల్లో పవన్ మార్క్

### జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం

- స్వయంప్రతిపత్తి, స్వావలంబన దిశగా అడుగులు
- ఫలితాన్నిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు
- గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం
- రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లోనూ నంబర్ వన్ స్థానం

**(అమరావతిఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలిడ స్వయం ప్రతిపత్తి, స్వావలంబనతో ముందుకు సాగాలిడ పల్లెలు జాతీయ సమగ్రత, సుస్థిరతకు మూల కేంద్రాలు కావాలిడ ఇవీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు నిర్దేశించుకున్న లక్ష్యాలు. గత ప్రభుత్వ విధానాలతో పూర్తిగా నిర్వీర్యం అయిన పంచాయతీరాజ్ వ్యవస్థకు పునరుజ్జీవం పోస్తూ,మిగతా **2లో...**





## పెట్టుబడులు పెట్టండి

సింగపూర్ పారిశ్రామికవేత్తలకు మంత్రుల ఆహ్వానం

మూడో రోజు పర్యటనలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ అంశాలపై అధ్యయనం

ఎస్‌బీఎఫ్ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం

**(అమరావతిఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రుల బృందం మూడో రోజు గురువారం పలు కీలక అంశాలపై అధ్యయనం చేసింది. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్)**మిగతా 2లో...**

## పోలింగ్ రికార్డు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్

బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

ఓటేసిన ప్రముఖులు, సినీతారలు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** పశ్చిమ బెంగాల్ తొలివిడత, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.78 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశ స్వాతంత్ర్యం అనంతరం నమోదైన అన్ని ఎన్నికల్లో కంటే అత్యధికంగా తమిళనాడులో 84.69 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 8.39 గంటలకు పోలింగ్ వివరాలను ఇసి విడుదల చేసింది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించారు. సాయంత్రం 6 గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు.**మిగతా 2లో...**

## నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై ముందుకు

- వెంటనే సీబీఐ విచారణ కోరాలని నిర్ణయం
- పెన్షనర్లు, ఉద్యోగుల బకాయిలపై 100 రోజుల్లో ప్రణాళిక
- 50 శాతం జీతం విరాళంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- రూ.700 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో గచ్చిబౌలి స్టేడియం ఆధునీకరణ
- నామినేటెడ్ పద్ధతిలో పీఏసీఎస్ చైర్మెన్ల నియామకం

:క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి

**హైదరాబాద్ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
న్యాయ నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీ కార్మికుల సమస్య లు,




కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు తదితర అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం గురువారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సమావేశమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం ముగి సిన అనంతరం క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. హైకోర్టు పూర్తి తీర్పు పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా.. లేదా కమిషన్ గడువు పొడగించాలా అనేది,**మిగతా 2లో...**

# పోలింగ్ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కు వినియోగించు కున్నారు. ప్రముఖ సినీ నటులు రజనీకాంత్, ఎంఎన్‌ఎం అధినేత, నటులు కమలహాసన్, టివికె అధినేత విజరు తదితరులు ఓటు వేశారు.

**పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు**

పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ముర్షిదాబాద్‌లో టిఎంసి కార్యకర్తలకు, ఎయుజెపి వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది. సిలిగురిలో టిఎంసి, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్టు సమాచారం. కుమార్‌గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొలగించారని బిజెపి అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపించారు. తనపై దాడి జరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు.

**తమిళనాడులో ప్రశాంతం**

తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలువురు ప్రముఖులు, ప్రముఖ రాజకీయ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

లైవ్ వెబ్ కాస్టింగ్‌లో పరిశీలన : ఇసి

లైవ్ వెబ్‌కాస్టింగ్‌లో రెండు రాష్ట్రాల్లోని అన్ని పోలింగ్ బూత్‌లను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ ఎస్ఎస్ సంధు, డాక్టర్ వివేక్ జోషి పరిశీలించినట్లు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



**ఉప ఎన్నికల్లో**

గుజరాత్‌లోని ఉమ్రెత్ 3 ఉప ఎన్నికల్లో 59.03, మహారాష్ట్రలోని బారామతి -201లో 57.48, రాహురి -223లో 55.31 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇసి ప్రకటించింది.

# నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై ముందుకు

**మొదటిపేజీ తరువాయి**

వారిచ్చే సలహాలు సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీవో జారీ చేసి తొమ్మిది నెలలైనా దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలియజేశారన్నారు. వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం తరపున మరోసారి సీబీఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు.కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ జ్యుడీషియల్ కమిషన్ నియామకంతో పాటు నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమనీ, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడిందన్నారు. పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టిందని తెలిపారు. ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవనీ, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు ఇలా ఉంటే బీఆర్‌ఎస్ శ్రేణులు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలన్నారు. వారి చేసిన తప్పిదం వల్ల కాళేశ్వరం పేరిట ఏటా రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్ల అదనపు భారం పడుతోందన్నారు. కేంద్ర మంత్రి ఎన్డీఎస్ రిపోర్ట్ చదువుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆహ్వానం మేరకు ఎన్డీఎస్ చైర్మెన్ అనిల్ జైన్ కాళేశ్వరం క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చారనే విషయం సంజరు గుర్తుంచుకోవాలని తెలిపారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ బకాయిలు గత సర్కార్ హయాం నుంచి కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.




రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని ముందుకొచ్చారని వివరించారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరిపి, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు(పీఏసీఎస్) నామినేటెడ్ పద్ధతిన పాలకవర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 64 ఎకరాల్లో 21 రకాల క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడంతో పాటు అవుట్ డోర్ స్టేడియం సామర్థ్యం 20 వేల నుంచి 50 వేలకు పెంచాలని నిర్ణయించిందని వివరించారు. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్‌కు ఇచ్చి..వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని నిర్ణయించామన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూసేకరణ పూర్తి చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.ప్రాజెక్ట్‌కు దాదాపు 2,427 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటివరకు 1020 ఎకరాలు సేకరించామన్నారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిసరాల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు కేటాయిస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని మంత్రులు వివరించారు.

# సమ్మెలో విషాదం

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులు వెంటనే మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. శంకర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నల్లగొండ, ఖమ్మంలలో మరో ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వరుస పరిణామాలతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను నియమించడం, పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడంతో గురువారం 45శాతం వరకు బస్సులు నడిచాయి. కాగా, రెండో రోజు సమ్మెలో ఊహించని పరిణామాలు చోటు చేసుకోవడంతో సమ్మె తదుపరి కార్యరూపం ఎలా ఉంటుందోననే అంశంపై నిఘా వర్గాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనాల దోపిడీ కొనసాగింది. రెండింతలకుపైగానే చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళన..**

రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా ఆర్టీసీ జేఏసీ సమ్మె కొనసాగింది. కార్మికులు విధులు బహిష్కరించి డిపోల ముందు, బస్‌స్టేషన్లలో నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. బస్సులు బయటికి రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. పలుచోట్ల సమ్మెలో పాల్గొంటున్న ఆర్టీసీ కార్మికులకు టెంట్లు, సామగ్రి సరఫరా చేయవద్దంటూ స్థానిక పోలీస్ స్టేషన్ల నుంచి టెంట్‌హౌస్‌ల నిర్వహకులకు ఆదేశాలు వెళ్లాయి. పలుచోట్ల వేసిన టెంట్లను కూడా తొలగించారు. దీనితో ఆర్టీసీ కార్మికులు ఎండలోనే ఆందోళనలు కొనసాగించారు. తమ సమ్మెకు అడ్డుపడొద్దని కోరుతూ కొన్నిచోట్ల కార్మికులు పోలీసు అధికారుల కాళ్లు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఒక తాత్కాలిక డ్రైవర్ బస్సును డిపో నుంచి బయటికి తీస్తుండగా.. ఇద్దరు మహిళా కండక్టర్లు మంజుల, సునీత బస్సుపై కారం చల్లారు. దీనిపై డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



**45శాతం బస్సులు రోడ్లపైకి!**

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముమ్మరం చేశాయి. డిపోలు, బస్టాండ్ల వద్ద పోలీసులను మోహరించారు. బస్సుల్లోనూ పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లను నియమించారు. ఈ క్రమంలో గురువారం సుమారు 45శాతం బస్సులు రోడ్డెక్కాయని అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు 98శాతం, అద్దె బస్సులు 95శాతం, ఆర్టీసీ బస్సులు 15శాతం నడిచాయని తెలిపారు. నారాయణపేట్, సిద్దిపేటలలో మాత్రం బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఇక సమ్మె కొనసాగుతున్న విషయం తెలిసిన జనం చాలా వరకు ప్రయాణాలు మానుకున్నారు. అత్యవసరమైన వారు, ముందే ఇతర ప్రాంతాలకు వెళ్లి చిక్కుకున్నవారు మాత్రం బస్టాండ్లకు వచ్చారు. దీంతో ప్రధాన బస్టాండ్లు బోసిపోయి కనిపించాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో బస్సుల్లో కండక్టర్లు లేకపోవడంతో మహిళలతోపాటు పురుషులూ ఉచితంగానే ప్రయాణించారు.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

**కోల్‌కతాఏప్రిల్ 23(ప్రజావినికిడి):**

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**మొదటిపేజీ తరువాయి**

'హర్మూజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతి తోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోందన్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బంధం కోనసాగుతుందని తెలిపారు

అయితే కొద్ది రోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాని ట్రంప్ నుండే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్బంధం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్ముజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం..**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం అవుతుందని ఎస్‌పి గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ గురువారం నివేధించింది. ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయని, సేవా రంగంలో కూడా కార్యకలాపాలు మందగించాయని ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఇంధన సరఫరాలకు ఎదురైన అత్యంత తీవ్రమైన ఆటంకాలను అధిక భాగం తట్టుకున్నప్పటికీ, దాదాపు రెండు నెలలనుండి కొనసాగుతున్న యుద్ధంతో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, ఆహార సరఫరాలపై ప్రభావం, ఆర్థిక వృద్ధి మందగించడానికి కారణాలు నివేదిక విశ్లేషించింది. యూరో జోన్‌లోని 21 దేశాలు అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఉన్నాయని, దీనికి సంబంధించిన అబివృద్ధి సూచిక మార్చిలో 50.7 శాతం నుండి ఏప్రిల్‌లో 48.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.

# పల్లెల్లో పవన్ మార్క్

**మొదటిపేజీ తరువాయి**

కీలక సంస్కరణలతో పాటు పలు రకాల పథకాలకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. జగన్ ఐదేళ్ల పాలనలో కేంద్ర అధికారులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను లెక్కచేసేవారు కాదు. నిధులు విడుదల చేసేవారు కాదు. అయితే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ శాఖ పగ్గాలు చేపట్టాక.. సమర్థులైన అధికారులు, సిబ్బందితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను రాబడుతున్నారు. సుమారు పది అంశాల్లో ఈ శాఖ ఇప్పుడు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 2025- 26 సంవత్సరానికి సంబంధించి రెండు కేటగిరీల కింద రాష్ట్రానికి 5 అవార్డులు దక్కాయి. స్థానికంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేస్తున్న 5 పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్(లను కేంద్రం ప్రకటించింది. మహిళా స్నేహపూర్వక పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామానికి మొదటి ర్యాంకు.. పేదరిక నిర్మూలన-జీవనోపాధి పెంపు కేటగిరీలో కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముల్లపల్లి గ్రామ పంచాయతీకి రెండో ర్యాంకు.. మౌలిక వసతుల స్వీయ అభివృద్ధి కేటగిరీ కింద ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమల గ్రామ పంచాయతీకి మూడో ర్యాంకు.. అదే విధంగా మండల స్థాయిలో చిత్తూరు జిల్లా కుప్పం మండలానికి అవార్డు దక్కింది. ఈ పంచాయతీలకు రూ.4.75 కోట్ల నగదు బహుమతి కూడా అందించనున్నట్లు కేంద్రం సమాచారం అందించింది.

# పెట్టుబడులు పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులతో సమావేశమైన మంత్రులు.. రాష్ట్రంలో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. మరోవైపు ఏపీలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ, స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం లక్ష్యంలో భాగంగా మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్‌లు పలు కీలక సంస్థలను సందర్శించారు. మొదట ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీని మంత్రులు సందర్శించారు. అక్కడి పోర్టు కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 2040 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద, పూర్తిస్థాయి ఆటోమేటెడ్ టెర్మినల్‌గా అవతరించనున్న టువాస్ పోర్ట్ పనితీరు, అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత గురించి తెలుసుకున్నారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో కృత్రిమ మేధ, స్మార్ట్ వ్యవస్థలను అనుసంధానం చేయడం ద్వారా సమయాన్ని, ఖర్చును ఎలా ఆదా చేస్తున్నారో మంత్రుల బృందం అధ్యయనం చేసింది. సింగపూర్‌లో పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే ప్రభుత్వ సంస్థ జేటీసీ కార్పొరేషన్‌ను కూడా మంత్రులు సందర్శించారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి, ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం, పర్యావరణ అనుకూల గ్రీన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడంలో జేటీసీ కీలక పాత్ర పోషించింది. భూమి కొరత ఉన్న సింగపూర్‌లో చమురు నిల్వ కోసం భూగర్భంలో నిర్మించిన జురాంగ్ కేవర్న్ మంత్రుల బృందాన్ని ఆకర్షించింది. ఏపీలోని తీర ప్రాంతాల్లో ఇలాంటి వినూత్న స్టోరేజ్ పద్ధతులపై మంత్రులు చర్చించారు. నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యంతో చేపడుతున్న గ్రీన్ ప్రాజెక్టుల అమలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా, పర్యటనలో భాగంగా సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో మంత్రులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలను వివరించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకువస్తున్న కొత్త పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి తెలియజేశారు. రాజధాని అమరావతితో పాటు గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిసోతాయని, ఆ తరువాతనే ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్ల వంతున పెరిగిన దాని బట్టి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక వెల్లడించింది. అలాంటి నివేదికలు పౌరుల్లో భయాందోళనలు సృష్టించడానికే డిజైన్ చేశారని మంత్రిత్వశాఖ పేర్కొంది. వాస్తవానికి గత నాలుగేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేని దేశం భారత్ ఒకటేనని వెల్లడించింది. ప్రజలపై ధరాభారం పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిరంతరం అనేక చర్యలు తీసుకుంటున్నాయని వివరించింది.

# రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

**న్యూఢిల్లీఏప్రిల్ 23(ప్రజావినికిడి):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి



**అంబర్ పేట్,(ప్రజావినికిడి):**
సిపిఎం పార్టీ అంబర్ పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.
ఈ సందర్భంగా సీపీఎం పార్టీ అంబర్ పేట్ జోన్ కన్వీనర్ మహేందర్ మాట్లాడుతూ,
హైదరాబాద్ నగరంలో ఇళ్ళు లేని పేదలకు సొంత ఇంటి కల ఎండమావిగానే తయారైనది.రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుదారులను ఎల్-1,ఎల్-2, ఎల్-3 కేటగిరీలలో విభజించి ఆన్లైన్లో ఉంచారు.దాని వలన తమ దరఖాస్తు ప్రభుత్వ లిస్టులో ఉన్నదని సంతృప్తి తప్ప, ఇంటి కల తీరలేదు.గ్రేటర్ హైదరాబాదులో ఇళ్ళ కోసం ఇల్లు లేని సుమారు 10 లక్షల మంది పేద ప్రజలు దరఖాస్తు చేసుకొని ఇళ్ళకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.అంబర్పేట నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలు సుమారుగా 45 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకొని ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారు.వీరికి ఇళ్ళు కట్టించి ఇచ్చే నిర్దిష్ట ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదు.గృహ నిర్మాణ శాఖా మంత్రి పత్రికా ప్రకటనలు తప్ప ఆచరణలో జరుగుతున్నది శూన్యం,గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిన అసంపూర్తిగా ఉన్న సుమారు 35 వేల ఇళ్లను,ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసి వెంటనే కేటాయించాలని సి.పి.ఎం.పార్టీ డిమాండ్ చేస్తున్నది.సంవత్సరానికి లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళు ళ్ళ కట్టించి ఇస్తామని అనేక కబుర్లు చెప్పిన బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో కట్టినవి,ఇచ్చినవి లక్ష కూడా లేవు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తుల మీద దరఖాస్తులు తీసుకొని ఊరిస్తున్నారు. తప్ప ఇళ్ళ నిర్మాణానికి నిర్దిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.
నగరంలోని స్లమ్స్ లో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాలలో నివాస ముంటున్న గుడిసె వాసులకు అద్దె స్థలంలో జి+3 పద్ధతిలో ఇళ్ళ నిర్మాణం చేపట్టి ఆ స్లమ్ వాసులకు కేటాయించాలి.
అంబర్పేట నియోజకవర్గంలో సొంత ఇళ్ళులేక అద్దె ఇళ్లలో కిరాయిలు చెల్లిస్తూ ఆర్థికంగా చితికి పోతున్న సుమారుగా 45 వేల కుటుంబాలకు ఇళ్ళ నిర్మాణం చేపట్టాలి.ప్రభుత్వ స్థలాలను సేకరించి ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి పూనుకోవాలి. నగర కోర్ సిటీలో పరిశ్రమలను నగర శివారులకు తరలిస్తున్న ప్రభుత్వం ఆ భూములను, ఇతర ప్రభుత్వ భూములను ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి కేటాయించాలి. గత రెండు సంవత్సరాలలో ఆ దిశగా జరిగిన ప్రయత్నాలు శూన్యం. అంబర్పేట నియోజకవర్గంలో పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయి సుమారుగా 10 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది.బతుకమ్మ కుంట చెరువును ఓపెనింగ్ చేయడానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ భూమి గురించి కూడా వివరించారు. కావున అంబర్పేట నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పోలీస్ క్వార్టర్స్ భూమిని అంబర్పేట నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇందిరమ్మండ్ల నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇటీవలే మంత్రి ఇళ్ళ నిర్మాణం కొరకు భూములు వెతకమని కలెక్టర్లను ఆదేశించారు.ఇది చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నమా? లేక జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆడుతున్న నాటకమా?
ఇళ్ళ అద్దెలు కట్టలేక,తమ ఆదాయంలో సగం పైగా ఇళ్ళ కిరాయిలకే ఖర్చు పెడుతూ పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ళ దరఖాస్తుదారులకు ఇళ్ళు కేటాయిస్తే వారందరినీ ప్రభుత్వం ఆర్థికంగా అదుకున్నటే, కావున ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ఇళ్ళు నిర్మించి కేటాయించాలి.
అసంపూర్తిగా ఉన్న 35 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్ళ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం,ఇళ్ళ కేటాయింపు అలాగే కొత్త ఇళ్ళ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.
ధర్నా అనంతరం
డిప్యూటీ ఎమ్మార్వో ఎన్.బలరాంకు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి ఈ సమస్యను పై అధికారులకు ఫార్వర్డ్ చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.
ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ అంబర్పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, సుబ్బారావు, అఖిల్,షబానా, నాగేంద్ర, జహీరుద్దీన్,బస్తి వాసులు రజిత, లలిత,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం....

## కూలిపోయిన రేకుల ఇంటి పైకప్పు..

**6 లక్షల పైగా అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం.. -తమను ఆదుకోండి...పోగుల నీరజ మల్లేష్**

**బాధితులకు అండగా ఉంటాం ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తాం..గడ్డం శేఖర్ యాదవ్**





**శంషాబాద్, (ప్రజావినికిడి):** శంషాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో భారీగా వర్షం అకాల వర్షంతో ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో అకాల వర్షానికి చౌదర్ గూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్రారెడ్డి కాలనీలో నివసిస్తున్న పోగుల నీరజ మల్లేష్ అప్పుచేసి నూతనంగా నిర్మించుకున్న రేకుల ఇల్లు పైకప్పు కూలిపోవడంతో కన్నీటి పర్వతమయ్యారు. ఆరు లక్షలకు పైగా అప్పు చేసి ప్లాట్ కొన్నామని అనంతరం 15 లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం చేసుకున్నామని వర్షం కారణంగా ఇంటి పైకప్పు రేకులు కూలిపోయిందని రోజు కూలి పని చేసుకుంటూ తమకు ఉన్న ఇద్దరు ఆడపిల్లలతో కలిసి జీవిస్తున్నామని పోగుల నీరజ రోదించారు.



రెక్కడితే కానీ డొక్కాడని మాకు ఇంట్లోకి నీరు చేరడంతో తినడానికి తిండి కూడా లేకుండా పూర్తిగా అన్ని వస్తువులు వర్షం కారణంగా తడిసి ముద్దయ్యాయని వెంటనే ప్రభుత్వం తమను ఆదుకోవాలని అధికారులు సైతం తమను ఆదుకోని న్యాయం చేయాలని రోదించారు.

**కూలిన ఇంటిని పరిశీలించిన గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్**

అకాల వర్షం కారణంగా ఇంద్రారెడ్డి కాలనీలో కూలిపోయిన ఇంటి బాధితుల వద్దకు గడ్డం శేఖర్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్ తో కలిసి వెళ్లి ఇంటిని పరిశీలించి బాధితులకు మనోధైర్యాన్ని కల్పించారు.గడ్డం శేఖర్ యాదవ్ అనంతరం బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తామని వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని ఇంటి నిర్మాణం కోసం కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తానని గడ్డం శేఖర్ యాదవ్ బాధితులకు పోగుల నీరజ మల్లేష్ కు భరోసా కల్పించారు.



# తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసిన సర్పంచ్


**వాజేడు, (ప్రజావినికిడి):**
గుమ్మడిదొడ్డి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలగా డ్రైనేజ్ లేనందున డ్రైనేజీ నుండి వెళ్ళవలసిన నీరు రోడ్లమీదకు చేరుతున్నది,విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బోదేబోయిన భారత్ కుమార్ స్థానిక ప్రజలతొ విచారణ చేపట్టి జెసిబి సహాయంతో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసి మురుగు నీటిని కాలువలోకి మళ్ళించారు , అనంతరం నీటి కారణం చేత గుంతలుగా మారిన రోడ్డును గ్రావెల్ మట్టి తో రోడ్డు ను సదున చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


# ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ):**
కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరుఫున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. రేపు(శుక్రవారం) ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి శ్రీ సుముఖ సుబ్రహ్మణ్యేశ్వర సేవా నిధి మందిరం నందు శ్రీ సాంబసదాశివ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అలాగే శ్రీ యోగ రామ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,సీనియర్ భారస నాయకులు మహేష్ రెడ్డి,యాదగిరి నేత,కాలనీ అధ్యక్షులు పరమేష్ గౌడ్,ఉపాధ్యక్షులు రమేష్,కోశాధికారి మల్లికార్జున్ మరియు సభ్యులు ప్రసాద్,సైదిరెడ్డి,సంతోష్,రామ్మోహన్,బాల్ రెడ్డి,సుభాషిని,రామ, సౌందర్య,భారతి తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు నిర్లక్ష్యంతోనే ఆర్టీసీ సమ్మె:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**దిల్ సుఖ్ నగర్ ,(ప్రజావినికిడి):**
ప్రభుత్వ మొండి వైఖరికీ నిరసనగా దిల్ సుఖ్ నగర్ సిటీ డిపో వద్ద ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించి సమ్మె విరమింపజేయాలని కోరారు.ప్రభుత్వ నిర్లక్ష్యం బాధ్యత రహితం కారణంగానే ఉద్యోగులు సమ్మెకు దిగారన్నారు.కావున ప్రభుత్వం చొరవ తీసుకొని వారి కోరిక నెరవేర్చి సమ్మె విరమించెలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బారాస పార్టీ యువ నాయకులు సొంటి చంద్రశేఖర్ రెడ్డి అలాగే ఆర్టీసీ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బహదూర్ పుర దర్గా ఇండియా పెట్రోల్ బంక్ వద్ద

# ఆటో డ్రైవర్ల ఇబ్బందులు..





**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ బహదూర్ పుర ఇండియన్ పెట్రోల్ పంప్ లో ఆటో గ్యాస్ (ఎల్ పి జి /సీ ఎన్ జి ) దొరకడం లేదన్న సమస్యపైదేశంలోని పలుచోట్ల ఆటో డ్రైవర్లు తీవ్రమైన గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. పురాణపుల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఉదయాన్నే నాలుగు గంటలకు వెళ్లి పెట్రోల్ పంపులో ఆటో పెట్టుకొని ఇబ్బందులతో గురవుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహా నగరం లో గ్యాస్ కొరత మరింత గోచరంగా
దిగజారింది. దీనివల్ల రోజుకు వచ్చే ఆదాయం తగ్గి ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**గ్యాస్ కొరతకు ప్రధాన కారణాలు..**
అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన సరఫరా లోపంప్రైవేట్ స్టేషన్లలో నిల్వలు లేకపోవడండిమాండ్ పెరగడంఈ సమస్య వల్ల కొన్ని నగరాల్లో ఆటో చార్జీలు కూడా పెరిగినట్లు సమాచారం,అయితే ప్రభుత్వం దేశంలో గ్యాస్ సరఫరా పూర్తిగా లేకపోవడం వలన ఆటో డ్రైవర్లు ఇబ్బందులు వ్యక్తం చేస్తున్నారు.స్థానిక సమస్యలపై ప్రజలు కూడా ఎండాకాలం ఆటో లేకపోవడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సరఫరా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ,సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు.

# ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

## డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫజక్‌కు చెక్ -ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్‌ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ - విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్టక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్‌స్టలెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు. అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

# ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

## తాండూరులో టెంట్ సామాను ఇవ్వకుండా పోలీసుల ఒత్తిడి -రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ తలసాని

**హైదరాబాదఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని,

తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా



సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేస్తామని ఎల్‌అండ్‌టీ ముందుకు వస్తే బెదిరించారని తెలిపారు . మేడిగడ్డ కుంగినప్పుడు ఆగమేఘాల మీద వచ్చిన ఎన్డీఎస్ఏ , ఎస్ఎల్‌బీసీ కుంగి 8 మంది చనిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యం వచ్చింది.వచ్చిన ధాన్యం చూసి కేంద్రమే ఆశ్చర్యపోయింది. ఆఖరికి వరి కొనలేమని కేంద్రం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేత కాదని, అన్ని వర్గాల వారు ప్రభుత్వం పై కోపంతో ఉన్నారని వెల్లడించారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ , బీ ఆర్ఎస్ ఖైరతా బాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి , కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి , బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె . కిషోర్ గౌడ్ పాల్గొన్నారు ,

# ఎకరా 51.25 కోట్లు

## ఉస్మాన్ నగర్‌లో భూమికి పలికిన ధర ఇదీ..
## 10.09 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన రాజపుష్ప
## టీజీఐఐసీ వేలంలో రూ.517 కోట్లతో దక్కించుకున్న సంస్థ
## గేటెడ్ రెసిడెన్షియల్ కమ్యూనిటీ నిర్మాణానికి ప్రణాళిక



**హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
తెల్లాపూర్ సమీపంలోని ఉస్మాన్‌నగర్‌లో ఎకరా ధర రూ.51.25 కోట్లు పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో రియల్ ఎస్టేట్ సంస్థ రాజపుష్ప ప్రాపర్టీస్ ఈ భూమిని దక్కించుకుంది. ప్లాట్ నంబర్ 1లో సుమారు 10.09 ఎకరాల్లో సగటున ఎకరానికి రూ.51.25 కోట్ల ధరగా నమోదైంది. ఇది రిజర్వ్ ధర రూ.39 కోట్లతో పోలిస్తే 30శాతం కంటే ఎక్కువ ప్రీమియం కావడం గమనార్హం. అలాగే, ప్లాట్ నంబర్ 6(సుమారు 5.72 ఎకరాలు) కూడా ఒక్కో ఎకరానికి రూ.44 కోట్లు వరకు బిడ్లు పొందింది. మొత్తం ఆక్షన్‌లో సగటు ధర ఒక్కో ఎకరానికి రూ. 48.6 కోట్లు నమోదై మార్కెట్‌లో గట్టి పోటీని సూచించింది. ఈ రెండు ప్లాట్ల ద్వారా టీజీఐఐసీకి సుమారు రూ.769 కోట్ల ఆదాయం సమకూరినట్లయింది. ఈ ప్రాంతం ఓఆర్ఆర్, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కీలక ఐటీ హబ్‌లకు సమీపంలో ఉండటంతో ఈ స్థాయి పోటీ కనిపించింది

# హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణ

## మేఘావృతమై ఉరుములతో చిరుజల్లులు



**హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** హైదరాబాద్ మహానగరంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండలు దంచి కొట్టగా.. ఆ తర్వాత ఉన్నట్టుండి వాతావరణం మేఘావృతం అయ్యింది. ఆకాశం మేఘావృతమై ఉరుములతో పలుచోట్ల చిరుజల్లుల కురిసాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావం నెలకొందని వాతావరణశాఖ వెల్లడించింది. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

# కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

## హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే
## మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**



కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్ళైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని చేశారు

## కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పుతో దెబ్బ
## మాజీ ఎమ్మెల్యే బీగాల గణెశ్ వెల్లడి

**నిజామాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ):** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించడం ద్వారా న్యాయం గెలిచిందని మాజీ ఎమ్మెల్యే గణెశిష్ బిగాల అన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన ప్రాముఖ్యత లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలకమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయంగా ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని మండిపడ్డారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, చివరకు గత్యంతరం లేక ఇప్పుడు పనులు చేపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ దండు నీతుకిరణ్ శేఖర్, పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ ఔజఆం చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, గాండ్ల లింగం, మతీన్ తదితరులు పాల్గొన్నారు.
-----

# నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేలు జరిమాన

## హంగర్గ గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు



**నిజామాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ):** తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా పోతంగల్ హంగర్గ గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగు,రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని అన్నారు. దీంతో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్ అమ్మవద్దని, జంక్‌ఫుడ్స్ నిషిద్ధమని తెలిపారు .అనంతరం శివాజీ చౌక్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి, గ్రామ కార్యదర్శి గంగారాం, భజరంగ్, గోవింద్, ఉమ్మార్,జీవన్ తదితరులు పాల్గొన్నారు.
---------

# ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు
## వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం



**లక్నో,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** :ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.
--------------

# ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు




**గజ్వేల్ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు.
అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్ మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయారవుతాయి.
కొత్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.

-----

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

## యువత పట్టుదలతో ముందుకు సాగాలన్న మంత్రి వాకిటి



హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజావినికిడి): హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కానీ మారుతిసాగర్ తదితరులు పాల్గొన్నారు. భగీరథ జయంతి వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడుతున్నాం అన్నారు. సగరులు సమస్యల పరిష్కారం కోసం ముందుంటాం అన్నారు. కలియుగంలో కూడా భగీరథుని ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగుతున్నాం అని వెల్లడించారు. శివుని తలలో ఉండే గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహానీయులు భగీరథుడు అని అన్నారు. భగీరథ ప్రయత్నం అంటూ నేటి సమాజం ముందుకు సాగుతుందిబసవేశ్వరుడు పనిలోనే దేవుడు ఉన్నారని చెబితే..పని సాధించేవరకు ప్రయత్నం చేయాలని భగీరథుడు చెప్పాడని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే నేటి యువత ప్రేరణగా తీసుకోవాలన్నారు. భగీరథున్ని దిక్సూచిగా తీసుకొని యువత ముందుకుసాగాలని పిలుపునిస్తున్నాం అని అన్నారు.

------

# ఐఎఎస్ అహ్మద్‌బాబుపై హైకోర్టు సీరియస్

## వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశం

## ఇన్నాళ్లూ ఎందుకు ఉపేక్షించారని సిఎస్‌కు ప్రశ్న



**అమరావతి,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుపై ఏపీ హైకోర్టు నిప్పులు చెరిగింది. ఉద్యోగుల పట్ల రాగద్వేషాలతో వ్యవహరించే వ్యక్తి ఐఏఎస్ అధికారిగా కొనసాగడానికి వీల్లేదని ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. చట్టం అన్నా, కోర్టు ఉత్తర్వులన్నా ఆయనకు గౌరవం లేదని న్యాయస్థానం మండిపడింది. బీపీసీ నిర్వహించి, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించకుండా ఫైళ్లను తొక్కిపెడతారా? ఇది ఉద్యోగులను వేధించడం కాదా? వారి జీవితాలతో ఆటలాడుతారా? అంటూ ధర్మాసనం నిలదీసింది. అహ్మద్ బాబుపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎందుకు మౌనంగా ఉన్నారని కోర్టు ప్రశ్నించింది. ఆయన్ను ఇంకా అదే పోస్టులో ఎందుకు కొనసాగిస్తున్నారని, ఇటువంటి వారిని తక్షణమే 'లూప్‌లైన్'లో వేయాలని సూచించింది. అహ్మద్ బాబుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని హైకోర్టు హెచ్చరించింది. ఒకవేళ ఆరోపణలు నిజమని ఆధారాలు ఉంటే, ఆయన్ను సర్వీసు నుంచి డిస్మిస్ చేయాలని కూడా ఆదేశిస్తామని స్పష్టం చేసింది. అహ్మద్ బాబు వ్యవహారంపై బాధితుడు/పిటిషనర్ ఇచ్చిన వినతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేమిటో తమ ముందు ఉంచాలని అడ్వకేట్ జనరల్‌ను కోర్టు ఆదేశించింది. ఒకవేళ మాకు అధికారం ఉంటే ఇప్పుడే అహ్మద్ బాబును సస్పెండ్ చేసేవాళ్లమని కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ వ్యవహారంపై తదుపరి విచారణను హైకోర్టు నేటికి వాయిదా వేసింది. ఉన్నత స్థాయి అధికారిపై న్యాయస్థానం ఇంత కఠినంగా స్పందించడం ఇప్పుడు ఏపీ అధికార వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# 26న వాసవీ మాత జయంతి

## అధికారికంగా నిర్వహించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం, అహింసా మూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి వేడుకలను ఇకపై ప్రతి ఏటా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ అధికారిక జీవో విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ప్రతి సంవత్సరం 'వైశాఖ శుక్ల పక్ష దశమి' రోజున వాసవి మాత జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఈ పర్వదినం ఏప్రిల్ 26వ తేదీన వస్తుండటంతో, ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఊాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను కోరింది. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల కోసం అయ్యే ఖర్చును సంబంధిత శాఖ బ్జడెట్ నుంచే కేటాయించనున్నారు. వ ఊాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సమాజ సేవలో, వ్యాపార రంగంలో ముందుండే ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని ఈ నిర్ణయం పెంపొందిస్తుందని వారు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు పేరుతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ నెల 26న తెలంగాణవ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, ఆర్యవైశ్య సత్రాలలో వేడుకలు ప్రభుత్వ లాంఛనాలతో అత్యంత వైభవంగా జరగనున్నాయి.




# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు



## రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

### మరో రంగారెడ్డి కానున్న అనకాపల్లి

### పరిశ్రమల రాకతో మెండుగా ఉద్యోగావకాశాలు

### ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు

**అనకాపల్లి, ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** విశాఖకు ఎక్కువ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పర్యటించిన సీఎం.. రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని.. అన్ని బస్సులను ఏసీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లా చేస్తామని అన్నారు. ఈ జిల్లాను అదృష్టం వరించిందని.. భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అనకాపల్లి నంబర్‌వన్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారింది. ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయి. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయి. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత నాది. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఫూట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ స్టీల్ కంపెనీ వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని.. ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదని సీఎం అన్నారు. ఉద్యోగాల కోసం ఏపీకి రావాల్సిన పరిస్థితి తీసుకొస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు తీసుకొస్తామన్నారు. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2019-24 మధ్య ఏపీలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని వైసీపీ కుప్పకూల్చిందని మండిపడ్డారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఉచితంగా కరెంట్ వచ్చే సోలార్‌ను వినియోగించుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.12 వేల కోట్ల భారం మోపారన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలు వెనక్కిపోయాయని సీఎం అన్నారు. సొంత బాబాయ్‌నే చంపిన చిల్లర పార్టీ వైసీపీ అంటూ మండిపడ్డారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని చెప్పారని.. పోస్టుమార్టం తర్వాత గొడ్డలిపోటుగా తేలిందన్నారు. వాళ్లే నేరం చేసి.. ఆ పాపాన్ని తమపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం నేరస్తులతో రాజకీయం చేస్తున్నాం' అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఏపీ పునర్నిర్మాణం చేస్తామని చెప్పాం.. చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పామన్నారు. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి జరగాలని.. సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులే కరెంట్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి రావాలని చెప్పుకొచ్చారు. రెండుమూడేళ్లలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ కరెంట్ అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏపీకి ఇప్పటికే రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని.. 22 నెలల్లో 800కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని సీఎం తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. 'ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకోండి.. రాయితీ ఇస్తాం' అని ప్రకటించారు. 23 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, 22 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.4 వేల కోట్లకుపైగా ట్రూడౌన్ ఛార్జీల భారం తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టాం. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలింది. ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశాం. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశాం. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి. మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయి. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వే వస్తాయని చంద్రబాబు అన్నారు.

# కాంగ్రెస్ బి.జె.పి ల కుమ్మక్కు రాజకీయాలకు చెంపపెట్టు.

### -నల్గొండ టి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు రమావత్ రవీంద్ర నాయక్ .

### -హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ కు బ్రేక్ -బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే -కంచర్ల భూపాల్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి:**
**ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** రాష్ట్రంలో సంచలనాలకు కేంద్ర బిందువైన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారానికి హై కోర్టు ఇచ్చిన తీర్పు గట్టి సమాధానమని బీ.ఆర్.ఎస్ నేతలు అభిప్రాయపడ్డారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాల యంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో పార్టీ ముఖ్య నేతలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పీసీ ఘోష్ కమిషన్ ను, అందుకు సహకరిస్తున్న కాంగ్రెస్ వైఖరిని వారు తప్పుబట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అ ధ్యక్షుడు రవీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజా కోర్టులో కాంగ్రెస్ అబద్ధాలు బట్టబ యలయ్యాయని ధ్వజమెత్తారు. “కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్లో రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే పీ.సీ ఘోష్ కమిషన్ నడుచుకుందని హైకోర్టు నిర్ధారించిందని, ఇది కాంగ్రెస్, బీజేపీల కుమ్మక్కు రాజకీయాలకు చెంపపెట్టు” అని ఘాటుగా స్పందించారు. కేవలం కేసీఆర్, హరీష్ రావులను బదనాం చేయడం కోసం, ఆరుగ్యారెంటీలను పక్కన పెట్టి ప్రభుత్వం 'డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులో జరుగుతున్న అన్యాయంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించిన ఆయన, జిల్లా రైతుల ప్రయోజనాలను కా పాడాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవన్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని ఆయన పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ పీసీసీ నివేదికని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతు న్న మాట ఇవ్వాళ అక్షరాల నిజమని తేలిపోయిందని అని ఆయన విమర్శించారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆ ర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవ్వాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్ష ణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కో సం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని అభిప్రాయపడ్డారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజిలో స్వల్పంగా దెబ్బ తిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని ఆ యన హితవు పలికారు. గోదావరి జలాలను పక్క రాష్ట్రా నికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలో వాతలు తప్పవని హెచ్చరించా రు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలా లకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొన సాగిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్ర భు త్వం పంట కొనుగోళ్లలో రైతులను దారుణంగా మోసం చేస్తోందని వి మర్శించారు. “ధాన్యం కొనుగోలు లో క్వింటాల్కు 8-9 కిలోల తరుగు పేరుతో దోచుకుంటున్నారు. రైతుల ఇబ్బందులను గాలికి వదిలేసి, మంత్రులు కమిషన్ల మీదే దృష్టి పె ట్టారని ఆరోపించారు. రేపటి నుం చి తాము కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా ఉం టామని, అవసరమైతే కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమని హెచ్చరించా రు. అలాగే ఆర్టీసీ కార్మికుల సమ స్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లు చిరు మర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్ కుమార్, బండా నరేందర్ రెడ్డి, చికిలం అనిల్ కుమార్ , పల్లె రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు నీడ !

**ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో



ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్థరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

---

## హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

### మంత్రి సవిత సంచలన వ్యాఖ్యలు




**అమరావతిఏప్రిల్ 23(ప్రజావినికిడి):** : సమాజం కోసం మంచి చేసే నాయకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ తెలుగుదేశం అయితే హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ అంటూ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. హత్యలు చేయటం, సాక్షుల్ని బెదిరించటం, రేటు మాట్లాడటం, కుటుంబసభ్యులను, జడ్జిలను కూడా బెదిరించాలని చూడటం జగన్‌కు అలవాటు అంటూ మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తరహాలోనే వైసీపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తండ్రి శవం పెట్టుకుని రాజకీయం చేయటం, బాబాయ్ గొడ్డలి పోటు ఘటనలను ఇప్పటికే చూశామని మంత్రి తెలిపారు. చంపటం, రౌడీలను, గూండాలను తయారు చేయటమే వైసీపీ పనిగా పెట్టుకుందన్నారు మంత్రి. అనంత బాబును జగన్ నెత్తిన పెట్టుకోవటంతోనే దళితుడైన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సైకో తనానికి పరాకాష్టగా అనంత బాబు వ్యవహారం ఉందన్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. గతంలో ఏమరపాటు ఉండి ఉండొచ్చేమో కానీ ఇప్పుడు ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జగన్ వల్ల బలయ్యేవారిలో బీసీలు, దళితులే ఎక్కువ మంది ఉన్నారని మంత్రి సవిత పేర్కొన్నారు.

## హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలను సహించం

### చట్టపరమైన చర్యలకోసం పోరాడుతుంటాం

### టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరిక

**తిరుపతి,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** ): హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలపై హిందూ దేవుళ్లపై అవమానకర వ్యాఖ్యలు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంలో న్యాయస్థానాలను ఆశ్రయించి భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 298 ప్రకారం కేసులు వేస్తామని భాను ప్రకాశ్ హెచ్చరించారు. ఇటీవల అలాంటి వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేసినట్లు భాను ప్రకాశ్ రెడ్డి గుర్తు చేశారు. సోషల్ మీడియా ద్వారా హిందూ దేవతలపై విమర్శలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు. కొంతమంది హిందూ ధర్మంపై విషం చిమ్ముతూ సోషల్ మీడియా ద్వారా డబ్బులు సంపాదిస్తున్నారని ఆగ్రహించారు. దేవాలయాలు సెక్యులర్ సంస్థలు కాదని.. అవి హిందూ ప్రార్థనా స్థలాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ మేరకు దేవాలయాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు హిందువులకు మాత్రమే ఉండాలన్నారు. శ్రీశైలంలో అన్యమతస్తులు సగం జనాభా ఉన్నారన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ అవసరమని.. మేధావులు, రిటైర్డ్ న్యాయమూర్తులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడుల విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి హిందూ సంప్రదాయాల రక్షణకు కట్టుబడి ఉందని భాను ప్రకాశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

----------

## అనంతలో హనీట్రాప్ ముఠా

### ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అనంతపురం,ఏప్రిల్ 23(ప్రజావినికిడి):** అనంతపురంలో గత కొంతకాలంగా ప్రముఖులే లక్ష్యంగా సాగుతున్న హనీట్రాప్ ముఠా వ్యవహారం బట్టబయలైంది. హనీ ట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కింగ్ రంగమ్మ నాయుడు అలియాస్ చిన్ని నాయుడమ్మతో పాటూ దబ్బర రాజేష్, జయలక్ష్మి, మల్లేశ్వరి, అనంత కుమారిని అరెస్ట్ చేశారు. ఉదయ్ భాస్కర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ముఠా ఇప్పటివరకు పలువురిని హనీ ట్రాప్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 'మల్లేశ్వరి, రంగమ్మ నాయుడు పథకం ప్రకారం అమాయకులను, బాగా డబ్బున్నవాళ్లకు వల వేసి ట్రాప్ చేసేవారు. ఆపై బెదిరింపులకు పాల్పడి లక్షలాది రూపాయలు వసూలు చేసేవారు. నిందితుల వద్ద నుంచి రూ.13 లక్షల నగదు, రెండు కత్తులు, అలాగే ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నాం. అయితే, హనీ ట్రాప్‌కు గురైన బాధితులు కేసులు నమోదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఎవరైనా ముందుకు వస్తే.. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. ఈ కేసుకు రాజకీయ పార్టీలతో ఎలాంటి సంబంధం లేదు. కొందరు నాయకులతో నిందితులు ఫొటోలు దిగిన విషయాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని అపోహలు సృష్టించవద్దని అన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో రోబోల సందడి..

### ఓటర్లకు చీరకట్టులో స్వాగతం!

**ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వేలూరు జిల్లాలో ఒక వినూత్న, ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. కొన్ని ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు రోబోలు స్వాగతం పలికాయి. టెక్నాలజీ, ప్రజాస్వామ్యం మేళవించిన ఈ ప్రయోగం ఓటర్లకు సరికొత్త అనుభూతిని అందించింది.

వేలూరు జిల్లాలోని గుడియాట్టం, వేలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. గుడియాట్టంలోని ప్రభుత్వ మున్సిపల్ హయ్యర్ సెకండరీ పాఠశాల కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు ఆశ్చర్యపోయారు. అక్కడ చీరకట్టులో అలంకరించిన ఒక రోబో, చేతిలో పువ్వులు, చాక్లెట్లతో నిలబడి ఓటర్లను తమిళంలో మర్యాదపూర్వకంగా పలకరించింది. ఎండ తీవ్రత నుంచి ఎలా సురక్షితంగా ఉండాలో సూచనలు కూడా ఇచ్చింది.




ఇదే తరహాలో వేలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ ముస్లిం హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన రోబో మరింత ప్రత్యేకం. ఇది తనలో అమర్చిన సెన్సర్ల సహాయంతో ఓటర్లకు షేక్‌హ్యాండ్ ఇచ్చి పలకరించింది. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు మొబైల్ ఫోన్లను నిర్దేశిత కౌంటర్లలో జమ చేయాలని స్పష్టమైన సూచనలు చేసింది.

ఈ రోబోలు కేవలం స్వాగతం పలకడానికే పరిమితం కాలేదు. ఓటర్లకు అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషించాయి. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్లను ఉపయోగించుకోవాలని నిరంతరం ప్రకటనలు చేశాయి. అలాగే, పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ సౌకర్యం అందుబాటులో ఉందని కూడా తెలియజేశాయి.

జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,427 పోలింగ్ కేంద్రాల్లో రెండింటిలో ఈ ప్రయోగాన్ని చేపట్టామని అధికారులు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేయడం, ప్రజలకు టెక్నాలజీని చేరువ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వినూత్న ప్రయోగం పట్ల ఓటర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. చాలా మంది ఆసక్తిగా రోబోలతో ముచ్చటించేందుకు ప్రయత్నించారు.

## కరిగిపోతున్న కల..

### అమెరికాను వీడాలనుకుంటున్న 40 శాతం మంది భారతీయులు



**ఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
చాలామంది భారతీయులకు, నిన్నటి వరకు అమెరికా అంతిమ గమ్యస్థానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఎంతోమంది మది నుంచి అమెరికా 'కల' నెమ్మదిగా కనుమరుగవుతోంది. అంతర్జాతీయ సంస్థ 'కార్నెగీ ఎండోమెంట్' నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, భారతీయ అమెరికన్ సమాజంలో రోజురోజుకీ ఆందోళన పెరుగుతోంది. ఎంతోమంది ఇప్పుడు అమెరికాను విడిచి వెళ్లాలనుకుంటున్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్ల కారణంగా 40 శాతం మంది భారతీయ అమెరికన్లు అగ్రరాజ్యం నుంచి శాశ్వతంగా వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నారని సర్వేలో వెల్లడైంది.

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆయన అనుసరిస్తున్న విధానాలు వలసదారులను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా అమెరికన్లకు మాత్రమే అనే నినాదం పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలో జీవన విధానాలు, ట్రంప్ ప్రభుత్వం తీరుపై యూగోవ్‌తో కలిసి కార్నెగీ ఎండోమెంట్ నిర్వహించిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

వివిధ కారణాల వల్ల, ప్రతి 10 మందిలో నలుగురు భారతీయులు అమెరికాను వీడాలనుకుంటున్నారు. రాజకీయ అస్థిరత కారణంగా తాము వెళ్లాలనుకుంటున్న వారు 58 శాతం మంది ఉన్నారు. జీవన వ్యయం కారణంగా 54 శాతం, వ్యక్తిగత భద్రత ఆందోళనతో 41 శాతం మంది అమెరికాను వీడాలని భావిస్తున్నారు. రెండోసారి ట్రంప్ పాలనపై తాము అసంతృప్తితో ఉన్నట్లు 71 శాతం మంది తెలిపారు. 2024-25 గణాంకాల ప్రకారం, అమెరికాలో 54 లక్షల మందికి పైగా భారతీయులు ఉన్నారు. అమెరికాలో వీరి వాటా 1.5 శాతంగా ఉంది.

ట్రంప్ అధికారంలోకి రాకముందు నుంచే అమెరికాకు అక్రమ వలసలు తగ్గుముఖం పట్టాయని ఈ సర్వే తెలిపింది. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చాక చట్టబద్ధ వలసలు భారీగా తగ్గినట్లు ఈ సర్వే తెలిపింది. అత్యధికంగా హెచ్1బీ వీసాలపై ఈ ప్రభావం కనిపించింది. గత సంవత్సరంలో ఈ వీసాల జారీ 25 శాతం మేర తగ్గిందని తెలిపింది. లక్ష డాలర్ల ఫీజు అమల్లోకి వచ్చాక వీసాల కోసం కంపెనీల నుంచి పిటిషన్లు 87 శాతం తగ్గుముఖం పట్టినట్లు ఈ సర్వే తన నివేదికలో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హెచ్1బీ వీసాలు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.

## అమరావతి రాజధానిగా కొత్త మ్యాప్ విడుదల




**అమరావతిఏప్రిల్ 23(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శాశ్వత హోదా కల్పిస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా కొత్త మ్యాప్‌ను విడుదల చేశాయి. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక రాష్ట్ర రాజధానిని ఖరారు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం తెలపడంతో, అమరావతికి తిరుగులేని అధికారిక హోదా దక్కింది. 2024 జూన్ 2 నుండి ఇది అమల్లోకి వచ్చేలా చట్టం చేయడం గమనార్హం. దీంతో గత కొన్నేళ్లుగా సాగుతున్న 'మూడు రాజధానుల' గందరగోళానికి శాశ్వతంగా తెరపడింది.ఏపీ అడ్మినిస్ట్రేటివ్ మ్యాప్‌లో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. ఈ నూతన జిల్లాల సరిహద్దులతో కూడిన అధికారిక పటాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తన రికార్డుల్లో, భారత అధికారిక మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అప్‌డేట్ చేసింది. ఇది దేశవ్యాప్త పరిపాలన అవసరాలకు ప్రామాణికంగా నిలవనుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మ్యాక్స్‌వెల్ రికార్డ్ బ్రేక్ చేసిన వైభవ్



రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో రికార్డుల మీద రికార్డులను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. తాజాగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 8 పరుగులకే పెవిలియన్ చేరినప్పటికీ వైభవ్ తన పేరిట పలు రికార్డులు లిఖించుకున్నాడు. అతడితోపాటు జట్టు స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఓ అరుదైన ఘనత అందుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్‌కు ఘనమైన ఆరంభం దక్కలేదు. జైస్వాల్ వేగంగా ఆడినా, లీగ్‌లో తొలిసారి వైభవ్ ఇబ్బంది పడ్డాడు. 11 బంతులు ఎదుర్కొని కేవలం 8 పరుగులే చేశాడు. అతడిని మెహ్సిన్ ఖాన్ పెవిలియన్‌కు చేర్చాడు. అయితే 2 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్దే వైభవ్ సూపర్ రికార్డు సాధించాడు. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ చిచ్చరపిడుగు 500 పరుగుల మైలురాయి అందుకున్నాడు. అతడు కేవలం 237 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో ఈ మైల్‌స్టోన్ సాధించిన బ్యాటర్‌గా అరుదైన ఘతన సాధించాడు. ఈ క్రమంలోనే స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ రికార్డ్‌ను వైభవ్ బద్దలుకొట్టాడు. 500 పరుగులు పూర్తి చేసేందుకు మ్యాక్స్‌వెల్ 260 బంతులు తీసుకున్నాడు. ఈ మ్యాచ్ ఆడిన నాటికి వైభవ్ వయసు 15ఏళ్ల 26 రోజులు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో 500 రన్స్ పూర్తి చేసుకున్న అత్యంత పిన్న వయస్కుడిగానూ వైభవ్ రికార్డు కొట్టాడు. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఎయిడెన్ మార్‌క్రమ్ సహా, మయంక్ యాదవ్, మోహ్సిన్ ఖాన్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. మొత్తం నాలుగు ఓవర్ల కోటాలో ఒక మెయిడెన్ సహా 20 రన్స్ ఇచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. ఇదివరకు యుజ్వేంద్ర చాహల్ (66 వికెట్లు) పేరిట ఈ రికార్డు ఉంది. తాజాగా ఆర్చర్ ఆ రికార్డ్‌ను అధిగమించాడు.

# 2028 ఒలింపిక్స్‌లో అధికారికంగా క్రికెట్

ప్రపంచంలో రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్ వేదికపై కనిపించి దశాబ్దాలు దాటిపోయింది. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. సరిగా 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడల్లో మళ్లీ మెరవబోతోంది. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ 2028 నిర్వాహకులు క్రికెట్ పోటీల కోసం దక్షిణ కాలిఫోర్నియాలోని పామోనాలో ఉన్న ఫెయిర్ గ్రౌండ్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. ఈ చారిత్రక మైదానంలో బుధవారం నాడు స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ స్టేడియం సుమారు పదివేల కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించబోతున్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన ఈ ప్రీమియర్ క్రికెట్ స్టేడియం పురుషుల, మహిళల పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నిర్మాణ పనుల ప్రారంభాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైలురాయిగా అభివర్ణించింది. ఒలింపిక్ చరిత్రలో తొలిసారిగా ఒక క్రీడ మ్యాచ్ సమయాలను భారతీయ ప్రామాణిక సమయానికి అనుగుణంగా రూపొందించడం విశేషం. భారత ఉపఖండంలోని వంద కోట్లకు పైగా ఉన్న క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతాయి. ఇది భారత కాలమాన ప్రకారం



వరుసగా రాత్రి 9.30 గంటలకు, ఉదయం 7 గంటలకు అవుతుంది. ఈ సమయాలు భారత టీవీ ప్రేక్షకులకు, డిజిటల్ వీక్షకులకు అత్యంత అనుకూలమైనవి. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతక పోరు ముగిసిన తర్వాతే స్వర్ణ పతక పోరు జరుగుతుంది. కానీ క్రికెట్ విషయంలో ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, స్వర్ణ పతక మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించాలని నిర్ణయించారు. ఇది భారత్ ప్రైమ్‌కు సరిగా సరిపోతుంది. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని నమ్మకంతోనే వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి నిర్వాహకులు ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. లా28 ఒలింపిక్స్‌లో క్రికెట్ అత్యంత వేగవంతమైన టీ 20 ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పురుషుల, మహిళల విభాగాల్లో చెరో ఆరు జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటాయి క్రికెట్ ఒలింపిక్స్‌లో చేర్చడం ద్వారా కొత్త దేశాలకు ఈ క్రీడను విస్తరించవచ్చని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో టీ20 ఫార్మాట్ విజయవంతమైంది. ఐసీసీ ఛైర్మన్ జైషా ఈ పరిణామాలపై సంతోషం వ్యక్తం చేశారు. వేదికల ప్రకటన అనేది ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి పడిన తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఐఓసీతో కలిసి క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ ఉద్యమంలో భాగం కావడం వల్ల క్రికెట్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి మరింత నిధులు , మద్దతు లభిస్తుందని ఐసీసీ పేర్కొంది. అమెరికా క్రీడా అభిమానులు హోమ్ రన్‌లు, లాంగ్ బాల్స్‌ను ఇష్టపడతారని, క్రికెట్‌లో ఇవి పుష్కలంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ ద్వారా అమెరికన్లకు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. లా28లో క్రికెట్‌తోపాటు బేస్ బాల్/ సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ వంటి క్రీడలు కూడా కొత్తగా చేరాయి. భారత్ , ఉపఖండం కోసం మీడియా హక్కుల విక్రయం విషయంలో నిర్వాహకులు మూడు రకాల ప్యాకేజీలు సిద్ధం చేశారు. మల్టీప్లాట్‌ఫామ్, టీవీ ఓన్లీ, డిజిటల్ ఓన్లీ. దీని ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# ధోనీ వల్లే స్టేడియాలు పసుపు మయం

## - చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్




దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ వల్లే తాము ఎక్కడికి వెళ్లినా స్టేడియాలు పసుపు మయం అవుతున్నాయని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. దురదృష్టవశాత్తు ఆయన ఆడటం లేదని, కానీ ఈ క్రేజ్ సృష్టికర్త ధోనీనే అని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో వాంఖడే వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రుతురాజ్ గైక్వాడ్‌ను ముంబైలో సీఎస్‌కే క్రేజ్ గురించి హోస్ట్ ప్రశ్నించాడు. ధోనీ వల్లే ఈ క్రేజ్ అని గైక్వాడ్ బదులిచ్చాడు. టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకోవాలనుకున్నామని గైక్వాడ్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ ఇది 50-50 నిర్ణయమే. పిచ్ బాగుంది. వాంఖడేలో ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా మెరుగైన ప్రదర్శన కనబర్చడం ముఖ్యం. కాబట్టి మొదట బ్యాటింగ్ చేసినా సరే అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడం కీలకం. మేం మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాం. కానీ కీలక సమయాల్లో అవకాశాలను చేజార్చుకుంటున్నాం. గత మ్యాచ్‌లో మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్‌లో కూడా మంచి ఆరంభం లభించింది.

# ఈ అవార్డు గుజరాత్ మంత్రికి అంకితమిస్తున్నా- రవీంద్ర జడేజా



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ భళా అనిపించింది. బ్యాటుతో తడబడ్డా బంతితో రాణించిన రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా ఆర్‌రౌండ్ ప్రదర్శనతో రాణించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డును అతడు 'గుజరాత్ విద్యాశాఖ మంత్రి'కి అంకింతం ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం అవార్డ్ ప్రజెంటేషన్‌లో జడేజా కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయంలో కీలకంగా మారినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు. 'మ్యాచ్ గెలిపించినందుకు హ్యాపీగా ఉంది. అయితే అవార్డును నేను గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి డెడికేట్ చేస్తున్నా. ఎందుకంటే నేను ఇవాళ అద్భుతమైన ప్రదర్శన చేస్తానని ఆమె నిన్ననే నాతో చెప్పింది. ఆమెకు థాంక్స్' అని జడ్డూ పేర్కొన్నాడు. కాగా, ఆ మంత్రి ఎవరో కాదు జడేజా సతీమణి రివాబా జడేజానే!సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం జడేజాకు ఇది 17వసారి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కాకుండా ఇతర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డు దక్కించుకోవడం మాత్రం ఇదే తొలిసారి. సీఎస్కేకు కాకుండా జడేజా ఇతర ఆయా జట్ల (రాజస్థాన్, కొచ్చి టస్కర్స్ కేరళ, గుజరాత్ లయన్స్)కు 75 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇక చెన్నై తరఫున 186 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగగా అందులో 16 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. లఖ్‌నవూతో మ్యాచ్‌లో పిచ్ బ్యాటింగ్‌కు అంతగా సహకరించలేదు. టాపార్డర్ విఫలమైన వేళ జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలబడి స్కోర్ బోర్డును నడిపించాడు. 29 బంతులు ఆడిన జడ్డూ 43 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.



# వాంఖడేలో శతకంతో గర్జించిన శాంసన్ ..

## - ముంబై ముందు భారీ లక్ష్యం..!

వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్ (101 నాటౌట్) ఐపీఎల్‌లో దంచేస్తున్నాడు. వరసగా రెండో సెంచరీతో చెన్నై సూపర్ కింగ్స్‌కు భారీ స్కోరందించాడు. వాంఖడే స్టేడియంలో టాపార్డర్ విఫలమైనా.. పట్టుదలగా ఆడిన శాంసన్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. స్పిన్నర్ గజన్‌ఫర్(2-25), అశ్వనీ కుమార్(2-37) రెండేసి వికెట్లు తీసినా జోరు తగ్గించని సంజూ డెత్ ఓవర్లలో రెచ్చిపోయాడు. క్రిష్ భగత్ బౌలింగ్‌లో మూడు సిక్సర్లతో శతకం అందుకోవడంతో పాటు చెన్నై స్కోర్ రెండొందలు దాటించాడు. టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. హార్దిక్ వేసిన రెండో ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్(22) గట్టిగానే అరుసుకున్నాడు. రెండు ఫోర్లు, సిక్సర్‌తో దడ పుట్టించాడు. మరో ఎండ్‌లో సంజూ శాంసన్(101 నాటౌట్ : 54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు) సైతం ఉతికేసినా.. ఫామ్ అందుకున్నట్టే కనిపించిన గైక్వాడ్.. గజన్‌ఫర్(2-25) బౌలింగ్‌లో సిక్సర్ కొట్టబోయి తిలక్ వర్మకు దొరికాడు. దాంతో, 32 వద్ద చెన్నై తొలి వికెట్ పడింది. అనంతరం శాంట్నర్ ఓవర్లో వరసగా రెండు ఫోర్లు బాదిన సర్ఫరాజ్ ఖాన్ (15) అనూహ్యంగా నాలుగో బంతికి బౌల్డయ్యాడు. ఆ తర్వాత వచ్చిన శివం దూబే(5)ను గజన్‌ఫర్ బౌల్డ్ చేసి రెండో వికెట్ సాధించాడు.

# మూడో టీ20లోనూ భారత మహిళల జట్టు వరుసగా ఓటమి

సౌతాఫ్రికా పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా మూడో టీ20లోనూ ఓటమిపాలైంది. జొహెన్నస్‌బర్గ్ వేదికగా ఆతిథ్య సౌతాఫ్రికాతో తాజాగా జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 193 పరుగుల భారీ టార్గెట్‌ను సఫారీ జట్టు కేవలం 1 వికెటే కోల్పోయి 16.3 ఓవర్లలోనే ఛేధించడం విశేషం. కెప్టెన్ లారా వోల్వార్ట్ (115 పరుగులు, 53 బంతుల్లో) సూపర్ సెంచరీతో అదరగొట్టగా, సున్ లస్ (64లి పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించింది. దీంతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. భారత్ బౌలర్లలో శ్రేయాంక పాటిల్ మాత్రమే వికెట్ తీయగలిగింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64 పరుగులు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66 పరుగులు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. స్మృతి మంధాన (37 పరుగులు) ఫర్వాలేదనిపించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 2, నదైన్ డి క్లర్క్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, తాజా విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను సౌతాఫ్రికా 3-0తో దక్కించుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ టీమ్‌ఇండియా ఓడింది. ఇరుజట్ల మధ్య నామమాత్రపు నాలుగో టీ20 మ్యాచ్ ఏప్రిల్ 25న జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ పర్యటనలో భారత్ గత రెండు మ్యాచ్‌ల్లో



కంటే ఈసారి బ్యాటింగ్‌లో మెరుగ్గా రాణించింది. సిరీస్ దక్కించుకోవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు మంధాన- షఫాలీ మంచి ఆరంభం ఇచ్చారు. వన్‌డౌన్‌లో జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమైనా, కెప్టెన్ హర్మన్ చెలరేగింది. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ జోరును ప్రదర్శించింది. 173.68 స్ట్రైక్ రేట్‌తో 66 రన్స్ చేసింది. చివర్లో రిచా ఘోష్ (18లి) కూడా బాగా ఆడింది. దీంతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఇంతటి స్కోర్ చేయడంతో టీమ్‌ఇండియా గెలుస్తుందని అనుకున్నారంతా. కానీ సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభం అయ్యాక అంచనాలు తారుమారయ్యాయి. ఓపెనర్లు వోల్వార్ట్, లుస్ రెచ్చిపోయారు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఈ క్రమంలోనే వోల్వార్ట్ సెంచరీ, లుస్ హాఫ్ సెంచరీలు సాధించారు. వీళ్లు విధ్వంసం సృష్టించడంతో చాలా ముందే భారత్ ఓటమి ఖరారైంది. 15.3 ఓవర్ వద్ద ఎట్టకేలకు భారత్ తొలి వికెట్ తీసింది. సెంచరీ సాధించిన వోల్వార్ట్‌ను శ్రేయంక ఔట్ చేసింది. అప్పటికి సౌతాఫ్రికా స్కోర్ 183. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనుంది. గతేడాది వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో భారత్ ఈ టోర్నీలో అడుగుపెట్టనుంది. టైటిల్ ఫేవరెట్‌గా దిగనున్న టీమ్‌ఇండియాకు ఆ టోర్నీ ముందు ఇలాంటి సిరీస్ ఆందోళన కలిగిస్తుంది. ఈ పర్యటనలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడగా, మూడింట్లోనూ భారత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు 193 పరుగుల భారీ లక్ష్యాన్ని సైతం కాపాడుకోలేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేదు. దీంతో వరల్డ్‌కప్ ముంగిట ఇలా అయితే ఎలా అంటూ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు!

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

### భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు




బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

------

# ఎమ్మెస్ రాజు

## దర్శకత్వంలో 'అగధ'... మరో కీలక పాత్ర పరిచయం




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎమ్మెస్ రాజు డైరెక్షన్ లో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి తాజాగా మరో కీలక పాత్రను పరిచయం చేశారు. ఇందులో 'సింహా' అనే ముఖ్య పాత్రలో నటుడు శ్రవణ్ రెడ్డి నటిస్తుండగా, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

ఈ పోస్టర్‌లో శ్రవణ్ రెడ్డి చీకటి నడుమ చేతిలో కాగడా పట్టుకుని ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. అతని చుట్టూ ఉన్న వాతావరణం, చూపుల్లోని తీవ్రత చూస్తుంటే.. రహస్యాన్ని ఛేదించే ప్రమాదకరమైన ప్రయాణంలో ఉన్న వ్యక్తిగా అతని పాత్ర ఉండబోతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎమ్మెస్ రాజు తన 'డర్టీ హరి' చిత్రంతో శ్రవణ్ రెడ్డిని తెలుగు తెరకు పరిచయం చేసిన సంగతి తెలిసిందే.

శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ పతాకంపై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో 'మహాదేవి' పాత్రలో కామాక్షి భాస్కర్ల నటిస్తున్నారు. ఇప్పటికే ఆమె పాత్రకు సంబంధించిన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. 85 రోజుల షూటింగ్, భారీ సెట్ వర్క్, 45 నిమిషాల నిడివి గల వీఎఫ్ఎక్స్‌తో 'అగధ' ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని దర్శకుడు ఎమ్మెస్ రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది.

## వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్



కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.

## మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.

## రాకా మూవీలో దీపికదే కీ రోల్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

## నేను నోరు తెరిస్తే అంతే సంగతులు

### గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది. నేను వెళ్లినప్పుడే ఎవరో ఒకరు దొరుకుతారు. ఇలా చాలా మంది నాకు కనిపించారు' అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఈ విషయంపై ఆమె చేసిన మరో కామెంట్ సంచలనం సృష్టించింది.నేను చూసిన వాటి గురించి నోరు తెరిస్తే కాపురాలు కూలిపోతాయి అంటూ గీతామాధురి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.గీతామాధురి చెప్పిన ఆ జంటలు ఎవరు? వారు టాలీవుడ్‌కు చెందినవారా? లేక ఆమె వ్యక్తిగత పరిచయాల్లో ఉన్నవారా? అనే విషయంపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. అయితే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పూర్తి ఎపిసోడ్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే. ఇక గీతామాధురి కెరీర్ విషయానికి వస్తే? ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరోవైపు పాటలు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. నందు భార్యగా, ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబాన్ని చూసుకుంటూనే తన కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నారు.

---------

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613